ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :156 బుధవారం ఏప్రిల్ 1 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com


PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# సరదా వెనుక పొంచి ఉన్న సైబర్ ముప్పు

- ఏప్రిల్ ఫూల్స్ డే సాకుతో సైబర్ నేరగాళ్ల పంజా
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నకిలీ లింకులు, ఆఫర్లు
- అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసుల హెచ్చరిక




మార్చి 31 (మనప్రజాప్రతినిధి): ఏప్రిల్ 1వ తేదీని ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ ఫూల్స్ డేగా జరుపుకుంటున్న తరుణంలో, సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. సరదా కోసం స్నేహితులు పంపే ప్రాంక్ లింకులు, ఫేక్ న్యూస్ వెనుక ప్రమాదకరమైన మాల్వేర్ మరియు ఫిషింగ్ ఎటాక్స్ పొంచి ఉన్నాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్ మరియు ఇన్‌స్టాగ్రామ్‌లలో "మీరు బహుమతి గెలుచుకున్నారు", "ఈ లింక్ క్లిక్ చేస్తే వింత కనిపిస్తుంది" వంటి ఆకర్షణీయమైన సందేశాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఒక్క చిన్న క్లిక్ మీ వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్ల చేతికి చిక్కేలా చేస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఈ రోజును ఒక అవకాశంగా మలచుకుని వినూత్న పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. నకిలీ గిఫ్ట్ వోచర్లు, ఉచిత రీఛార్జ్ ఆఫర్లు మరియు సెలబ్రిటీల పేరుతో వచ్చే నకిలీ వార్తలను నిజమని నమ్మి చాలామంది బాధితులుగా మారుతున్నారు. ఈ లింకులను క్లిక్ చేసిన వెంటనే మీ ఫోన్ లేదా కంప్యూటర్ లోకి తెలియకుండానే హానికరమైన సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ అయ్యే ప్రమాదం ఉంది. దీనివల్ల మీ బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు మరియు ఫోటోలు హ్యాకర్ల వశం అవుతాయి. సరదా కోసం చేసే చిన్న పొరపాటు మీ ఆర్థిక భద్రతకే ముప్పుగా పరిణమించవచ్చు. ఇటీవలి కాలంలో 'డీప్ ఫేక్' టెక్నాలజీని ఉపయోగించి ప్రముఖుల వీడియోలను సృష్టించి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం ఎక్కువైంది. ఏప్రిల్ ఫూల్స్ డే పేరుతో ఇలాంటి వీడియోలను వైరల్ చేసి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు. సైబర్ క్రైమ్ విభాగం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై నిరంతర నిఘా ఉంచింది. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా భయాందోళనలు కలిగించే వార్తలను లేదా అశ్లీల ప్రాంక్ వీడియోలను షేర్ చేస్తే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గ్రూపు అడ్మిన్లు కూడా తమ గ్రూపులలో వచ్చే




సమాచారాన్ని ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించి వచ్చే ఫేక్ కాల్స్ మరియు ఎస్ఎంఎస్ ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. "మీ అకౌంట్ బ్లాక్ అయింది" లేదా "కేవైసీ అప్‌డేట్ చేయకపోతే సేవలు నిలిచిపోతాయి" వంటి సందేశాలు పంపి, ఆపై ఏప్రిల్ ఫూల్ అని చెప్పే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో పొరపాటున కూడా మీ ఓటీపీ లేదా పిన్ నంబర్లను ఎవరికీ చెప్పకూడదు. బ్యాంకులు ఎప్పుడూ ఫోన్ లో వ్యక్తిగత వివరాలు అడగవనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవడం ద్వారానే ఇలాంటి ఆధునిక కాలపు మోసాల నుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు. ఏప్రిల్ ఫూల్స్ డేని ఆరోగ్యకరమైన హాస్యంతో జరుపుకోవాలని, డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తత వీడకూడదని నిపుణులు కోరుతున్నారు. తెలియని వ్యక్తుల నుండి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దు, అనుమానాస్పద యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దు. ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైతే వెంటనే '1930' హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. మీ స్నేహితులకు మరియు కుటుంబ సభ్యులకు కూడా ఈ భద్రతా సూచనలను తెలియజేయండి. సురక్షితమైన ఇంటర్నెట్ వాడకమే సైబర్ నేరగాళ్లకు మనం ఇచ్చే గట్టి సమాధానం

# మూసి పునర్జీవనం పనులపై సమీక్ష...

- ప్రజల సూచనలకు ఆహ్వానం
- పారదర్శకంగా ప్రాజెక్టు అమలు
- మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్ అభిప్రాయాల సేకరణ
- డిజైన్, పునరావాసం, ఆర్థిక అంశాలపై వేగవంత చర్యలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




హైదరాబాద్, మార్చి 31 (మనప్రజాప్రతినిధి): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మూసి పునర్జీవనం పనుల ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టును పూర్తిగా



ప్రజాస్వామ్య పద్ధతిలో, పారదర్శకంగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ప్రాజెక్టులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్ ద్వారా అభిప్రాయాల సేకరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ సూచనలను మెయిల్ ద్వారా పంపాలని కోరారు. వచ్చిన ప్రతి సూచనను అధికారులు విశ్లేషిస్తారని తెలిపారు. అవసరమైతే సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ సభ్యులు నేరుగా సమావేశమవుతారని పేర్కొన్నారు. ప్రజల ఆలోచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. నిర్మాణ డిజైన్లు, పునరావాస చర్యలు, రక్షణ సంబంధిత అంశాలు, బ్యాంకర్లతో చర్చలు వంటి కీలక అంశాలను సమన్వయంతో వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. పనులు సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మూసి పునర్జీవన ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సంబంధిత శాఖల అధికారులు కూడా హాజరై ప్రాజెక్టు పురోగతిపై వివరాలు వెల్లడించారు.

# సూర్యాపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం... అభివృద్ధిపై దృష్టి

- ప్రణాళికాబద్ధంగా బడ్జెట్ అమలు చేయాలని సూచనలు
- పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక ఫోకస్
- ప్రజా భాగస్వామ్యంతో పట్టణ అభివృద్ధికి పిలుపు




సూర్యాపేట, మార్చి 31 (మనప్రజాప్రతినిధి): సూర్యాపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు కీలక సూచనలు చేశారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బడ్జెట్ రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది నిరంతరం శ్రమించి పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలని అన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కింద చేపడుతున్న 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీల్లో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని సూచించారు.
సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలతో నేరుగా మమేకం కావడం ద్వారా పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దే బాధ్యత అందరిదని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# నగరం నలువైపులా హైడ్రా ఆపరేషన్స్.... ఆక్రమణలపై కఠిన చర్యలు

- నాగిరెడ్డి కుంటను కాపాడిన అధికారులు
- పార్కులు, రహదారుల ఆక్రమణల తొలగింపు
- స్థానికుల నుంచి హర్షం వ్యక్తం




హైదరాబాద్, మార్చి 31 (మనప్రజాప్రతినిధి): నగరం నలువైపులా మంగళవారం హైడ్రా అధికారులు విస్తృత స్థాయిలో ఆపరేషన్లు నిర్వహించి భారీగా ఆక్రమణలను తొలగించారు. ఐటీ కారిడార్ సమీపంలోని మంచిరేవుల ప్రాంతంలో ఉన్న 8.24 ఎకరాల నాగిరెడ్డి కుంటను కబ్జా నుంచి కాపాడారు. అలాగే పలు ప్రాంతాల్లో పార్కులు, రహదారులపై జరిగిన అక్రమ నిర్మాణాలను తొలగించారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో నాగిరెడ్డి కుంటను పూర్తిగా ఆక్రమించేందుకు ప్రయత్నించిన ఘటనను హైడ్రా అడ్డుకుంది. బడా నిర్మాణ సంస్థలు చెరువును కనిపించకుండా 20 అడుగుల టిన్ షీట్లతో ప్రహరీలు నిర్మించి, ఫెన్సింగ్ వేసి కబ్జా చేయాలని ప్రయత్నించాయి. మరికొన్ని సంస్థలు, వ్యక్తులు కలిసి చెరువులో భాగాన్ని ప్లాట్లుగా మార్చి అమ్ముకునే ప్రయత్నాలు చేసినట్లు గుర్తించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు స్పందించిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకున్నారు. చెరువులో ఏర్పాటుచేసిన ప్రహరీలు, తాత్కాలిక నిర్మాణాలను పూర్తిగా తొలగించి, చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ చర్యలతో 8.24 ఎకరాల నాగిరెడ్డి కుంటను రక్షించగలిగామని అధికారులు తెలిపారు. మెద్చల్‌మల్కాజిగిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం బౌరంపేట గ్రామ పరిధిలో గండిమైసమ్మమియాపూర్ ప్రధాన రహదారిపై అక్రమంగా నిర్మించిన షాపులను కూడా తొలగించారు. 150 అడుగుల ప్రధాన రహదారిపై నిర్మించిన షెడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నట్లు గుర్తించి, ముందస్తు నోటీసులు ఇచ్చి 10 షాపులను తొలగించారు. దీంతో రహదారి సౌకర్యం మెరుగుపడింది. అదేవిధంగా గట్‌కేసర్ మండలం అవుషాపూర్ గ్రామంలో 1440 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాట్లుగా మార్చి అమ్మే ప్రయత్నాలను అడ్డుకొని, ఆ స్థలాన్ని తిరిగి పార్కుగా గుర్తిస్తూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేశారు. హైడ్రా చేపట్టిన ఈ చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆక్రమణల వల్ల కోల్పోయే అవకాశమున్న చెరువులు, పార్కులు, రహదారులను కాపాడినందుకు అధికారులను అభినందించారు. నగర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇలాంటి చర్యలు కొనసాగాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ బి. సత్యప్రసాద్

- ముత్యంపేటలో నిర్మాణ పనులపై సమీక్ష
- లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం
- ధరల నియంత్రణ, గడువులోపు పనుల పూర్తి చేయాలని ఆదేశాలు



మన ప్రజాప్రతినిధి
దినపత్రిక



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ బి. సత్యప్రసాద్

మొదటి పేజీ తరువాయి



మల్లాపూర్, మార్చి 31 (మనప్రజాప్రతినిధి): మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా సమీక్షిస్తూ, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేసి నిర్మాణాన్ని ప్రారంభించాలని సూచించారు. ప్రతి లబ్ధిదారుడికి తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నదని తెలిపారు. ఈ పథకం ద్వారా పేదలకు గృహ సదుపాయం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇటుక, కంకర, బేస్మెంట్ వంటి నిర్మాణ సామగ్రి ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు సరసమైన ధరలకు సామగ్రి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు వెనుకబడిన చోట వెంటనే వేగం పెంచాలని హెచ్చరించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరగాలని, లబ్ధిదారులు అవసరమైన మేస్త్రీలు, కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆర్థిక సమస్యలు ఉన్నవారు ఐకేపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ దశల ప్రకారం బిల్లులు నేరుగా లబ్ధిదారుల ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లో జమ చేయబడతాయని వివరించారు.అనంతరం పలు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తి చేసి గృహప్రవేశం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, తహసీల్దార్, ఎంపిడీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

# శాసనసభ నిర్వహణపై తీవ్ర విమర్శలు

- సమయపాలన పాటించడంలేదని ఆరోపణలు
- టీ బ్రేక్ పేరుతో గంటల విరామంపై ప్రశ్నలు
- ప్రజా సమస్యల కంటే ఎన్నికల ప్రచారానికే ప్రాధాన్యతా?



హైదరాబాద్, మార్చి 31 (మనప్రజా ప్రతినిధి): తెలంగాణ శాసనసభ నిర్వహణపై బీఆర్ఎస్ నేత టి హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. సభకు అవసరమైన గౌరవం, సమయపాలన పాటించడంలేదని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. శాసనసభను రాజకీయ వేదికలా మార్చేశారని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో సాధారణంగా టీ బ్రేక్ 10 నిమిషాలు, లంచ్ బ్రేక్ అరగంట మాత్రమే ఉండగా, ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి వస్తున్నారని చెప్పి ఏకంగా నాలుగు గంటల టీ బ్రేక్ ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుకూలం కాదని అభి ప్రాయపడ్డారు.కేరళ ఎన్నికల ప్రచారం కోసం శాసనసభ సమావేశాలను ముందుగానే ముగించారని కూడా ఆయన ఆరోపించారు. 30వ తేదీనే హడావుడిగా సభ ముగించడం వెనుక రాజకీయ ప్రయోజనాలే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభను ముగించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రజల సమస్యలను చర్చించాల్సిన వేదికగా ఉన్న శాసనసభను రాజకీయ కార్యక్రమాలకు వినియోగించడం బాధాకరమని హరీష్ రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందా అనే సందేహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రజా సమస్యల కంటే ఎన్నికల ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన విమర్శించారు. శాసనసభ గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హరీష్ రావు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

# పేదల సొంతింటి కల సాకారం

- రాజమహేంద్రవరం లో టిడ్కో గృహాల పంపిణీ
- రూ.494 కోట్లతో నిర్మించిన గృహాల అందజేత
- అధునాతన సాంకేతికతతో నాణ్యమైన నిర్మాణం
- అన్ని మౌలిక సదుపాయాలతో లబ్ధిదారులకు ఇళ్లు





రాజమహేంద్రవరం, మార్చి 30 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా కీలక ముందడుగు వేస్తూ, రాజమహేంద్రవరం పరిధిలో రూ.494 కోట్ల వ్యయంతో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేసింది. నామవరం శాటిలైట్ సిటీలో నిర్వహించిన సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో భాగంగా ఈ గృహాలను అధికారికంగా అప్పగించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొని లబ్ధిదారులకు గృహ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, నాణ్యమైన నిర్మాణంతో ఈ గృహాలను నిర్మించి అందజేస్తున్నామని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ గృహ సముదాయాలను నిర్మించామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు సౌకర్యవంతమైన జీవన వాతావరణం కల్పించేందుకు అంతర్గత రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని వివరించారు.ఈ గృహ సముదాయాల సమీపంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అందుబాటులో ఉన్నాయని, లబ్ధిదారులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించాలని సూచించారు. త్వరలో జల జీవన్ మిషన్ ద్వారా గోదావరి నీటిని ప్రతి ఇంటికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గృహ నిర్మాణం మూడు విభాగాల్లో చేపట్టినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. 300 చదరపు అడుగుల గృహాలను పూర్తిగా ఉచితంగా అందించగా, 365, 430 చదరపు అడుగుల గృహాలను కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో, తక్కువ లబ్ధిదారుల వాటాతో, బ్యాంకు రుణ సదుపాయంతో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ఈ గృహాలను నిర్మించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, అదనపు కమిషనర్ టీవీ రామలింగేశ్వర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అమరావతిలో క్వాంటం వ్యాలీపై సమీక్ష... సీఎం చంద్రబాబు

- జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలకు ఏపీ ముందంజ
- ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో కలిసి క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు
- రాజధానిలో 8 టవర్ల నిర్మాణానికి ప్రణాళిక






అమరావతి, మార్చి 31 (మనప్రజాప్రతినిధి):అమరావతి క్వాంటం వ్యాలీ, క్వాంటం హార్డ్‌వేర్ ఉత్పత్తి ఎకోసిస్టంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. భవిష్యత్తులో సాంకేతిక రంగంలో క్వాంటం కంప్యూటింగ్ కీలక పాత్ర పోషించనుందని ఆయన పేర్కొన్నారు. జాతీయ క్వాంటం మిషన్ కింద చేపట్టిన కార్యాచరణను ఆంధ్రప్రదేశ్ తొలిగా అందిపుచ్చుకుని అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని సీఎం తెలిపారు. దేశంలోనే ముందుండే విధంగా క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి రాష్ట్రం కృషి చేస్తోందని చెప్పారు.ఈ ప్రాజెక్టులో భాగంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో తొలి క్వాంటం కంప్యూటర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల సాంకేతిక రంగంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.అమరావతిని భవిష్యత్తు సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి అనుకూలంగా రాజధానిలో 8 టవర్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ క్వాంటం వ్యాలీ ద్వారా పరిశోధన, ఆవిష్కరణలకు విస్తృత అవకాశాలు ఏర్పడతాయని సీఎం పేర్కొన్నారు. యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు సాంకేతిక రంగంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని తెలిపారు.అమరావతిని గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో ముందడుగు వేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశలు తెరవబడతాయని ఆయన అన్నారు.

# 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జనగామ, మార్చి 31 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ సభల నిర్వహణపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామ సభల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, లబ్ధిదారుల పేర్లను చదివి వినిపిస్తూ పారదర్శకతను పాటించాలని పేర్కొన్నారు. ఆర్థికంగా, సామాజికంగా లబ్ధి పొందిన వారు తమ అనుభవాలను సభల్లో పంచుకోవాలని సూచించారు.ప్రజా ప్రతినిధులను గ్రామ సభలకు ఆహ్వానించి, వారి ద్వారా సంక్షేమ పథకాలపై వివరాలు తెలియజేయాలని అన్నారు. ముఖ్యమంత్రి సందేశాన్ని గ్రామ సభల్లో వినిపిస్తూ ప్రజల్లో నమ్మకం పెంచాలని సూచించారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ద్వారా కళాజాతలు నిర్వహించి పథకాలపై అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు.అనంతరం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి నిరుపేదకు పథకాల లబ్ధి చేరేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని చెప్పారు. ఏప్రిల్ 6 నుంచి 11 వరకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆహార భద్రత, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, రక్షిత మాతృత్వ దినోత్సవం, ఎయిడ్స్ అవగాహన, హోమియోపతి, ఆయుష్, మత్తు పదార్థాల నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొని, జిల్లాలో గ్రామ సభలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు కొత్తగా ప్రవేశపెట్టే తొలిముద్ద, ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా పథకం, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల విద్యార్థులకు అల్పాహారం పథకం వంటి అంశాలను గ్రామ సభల్లో వివరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఈ పథకాలపై స్పష్టమైన అవగాహన కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు గోపీరామ్, వెంకన్న, జడ్పీ సీఈఓ మాధురి షా, డీపీఓ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయ, రవాణా, వైద్యారోగ్య శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సమన్వయంతో పని చేయాలని

# మైదుకూరులో సర్పంచ్‌లకు ఆత్మీయ సన్మానం

- వైయస్ఆర్‌సీపీ నేతల సమక్షంలో ఘన కార్యక్రమం
- స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల విస్తృత హాజరు
- సర్పంచ్‌ల సేవలకు ప్రశంసలు



మైదుకూరు, మార్చి 31 (మనప్రజాప్రతినిధి): వైయస్ఆర్ కడప జిల్లాలోని మైదుకూరు నియోజకవర్గంలో సర్పంచ్‌లకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మైదుకూరు పట్టణంలోని ఎస్‌సీసీఆర్ కళ్యాణమండపంలో మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల సేవలను గుర్తించి సన్మానించడం ముఖ్య ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప వైయస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి, కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి హాజరయ్యారు. వారితో పాటు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జడ్పీ ఛైర్మన్ రామగోవింద్ రెడ్డి కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో సర్పంచ్‌లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సర్పంచ్‌లకు శాలువాలు కప్పి సన్మానిస్తూ వారి సేవలను కొనియాడారు. గ్రామాభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు సర్పంచ్‌లు మరింత కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# దొడ్డి కొమురయ్య వారసులకే చైర్మన్ ఇవ్వాలి



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం,దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదా దొడ్డి కొమురయ్య వారసుడైన దొడ్డి చంద్రం కు మాత్రమే ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి,కురుమ సంఘం నేత అందె నాని బాబు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈనెల 28న పద్నాలుగు మందితో దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవ కమిటీ నియమించమని ఆ కమిటీలో అధికార పార్టీ నాయకులకు కాకుండా బీఆర్ఎస్ పార్టీ కి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీలో అనేకమంది కురుమలు ఉన్నారని వారిని కాదని బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి దొడ్డి కొమురయ్య వారసుడైన చంద్రంతో పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న కురుమలకు ఉత్సవ కమిటీలో చోటు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కురుమ సంఘం నాయకులు అందె బీరయ్య,భూమయ్య, అశోక్,కనకయ్య, శ్రీనివాస్,కరుణాకర్, యాదగిరి,బియ్య రాజు, తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో తరగతి గది నిర్మాణం



నేరేడుచర్ల(మన ప్రజాప్రతినిధి దినపత్రిక) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెంచికల్ దిన్నె నందు పారుపల్లి అనిల్ కుమార్ మరియు తక్కెలపాటి రవీంద్రనాథ్ ఠాగూర్ వారి సహకారంతో ఒక లక్ష నలబై వేల రూపాయల వ్యయంతో నిర్మించబడిన తరగతి గదిని పెంచికల్ దిన్నె సర్పంచ్ నర్సింగ్ చిన్న సోములు ప్రారంభించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎల్. శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని కొని యాడారు . అనంతరం దాతల్ని సన్మానించడం జరిగింది. పూర్వ విద్యార్థులు ,దాతలు ఇంకా ముందుకు వచ్చి సహకరించినట్లయితే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు సంసిద్ధంగా ఉన్నారని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వల్లంశట్ల వెంకటేశ్వరరావు వల్లంశట్ల కోటేశ్వరరావు సుంకరి వెంకటేశ్వరరావు గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు రాఘవరెడ్డి గోపయ్య శ్యాంసుందర్రావు అనిల్ కుమార్ సైదులు శ్రీనివాస్ రెడ్డి ఏసు పాదం లింగయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు

# 'ప్రజాప్రతినిధి' పత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్



మనప్రజాప్రతినిధి//బుదేరామార్చి ,31:ప్రజల గొంతుకగా నిలుస్తున్న 'ప్రజాప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ క్యాలెండర్ ను మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ ఘనంగా ఆవిష్కరించారు. మంగళ వారం పోలీస్ స్టేషన్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్ నాయక్ క్యాలెండర్ ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సమాజంలో పత్రికా రంగం కీలక పాత్ర పోషిస్తుందని 'ప్రజాప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ యాజమాన్యం క్యాలెండర్ ను తన చేతుల మీదుగా ఆవిష్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ పత్రిక మరింత వృద్ధి చెంది, నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ మెరుగైన సేవలందించాలని ఎస్సై రాజేష్ నాయక్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్ ( ప్రజాప్రతినిధి రిపోర్టర్) నర్సింలు, ప్రభాకర్, శ్రీను పాల్గొన్నారు.




# ప్రజాప్రతినిధి'పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన సదాశివపేట్ సిఐ వెంకటేశం




సదాశివపేట మార్చి 31 (మనప్రజాప్రతినిధి ):ప్రజల గొంతుకగా నిలుస్తున్న 'ప్రజాప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ క్యాలెండర్ ను సదాశివపేట సిఐ వెంకటేశం ఘనంగా ఆవిష్కరించారు. మంగళ వారం పోలీస్ స్టేషన్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశం క్యాలెండర్ ను విడుదల చేశారు.ఈ సందర్భంగా సీఐ వెంకటేశం మాట్లాడుతూ.. సమాజంలో పత్రికా రంగం కీలక పాత్ర పోషిస్తుందని 'ప్రజాప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ యాజమాన్యం క్యాలెండర్ ను తన చేతుల మీదుగా ఆవిష్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ పత్రిక మరింత వృద్ధి చెంది, నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ మెరుగైన సేవలందించాలని సిఐ వెంకటేశం ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ( ప్రజాప్రతినిధి రిపోర్టర్)నవీన్ కుమార్, నర్సింలు, ప్రభాకర్, వీరేందర్, శ్రీను పాల్గొన్నారు.

# చేర్యాల పోలీస్ వారి ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం, చేర్యాల పట్టణంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే అరైవ్ అలైవ్,కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రేష్మి పెరుమాళ్ ఆదేశాల మేరకు చేర్యాల ఎస్సై అపూర్వ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రోజున లారీ డ్రైవర్ల కోసం విజయ కంటి హాస్పటల్లో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై అపూర్వ రెడ్డి,మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో స్పష్టమైన కంటి చూపు యొక్క ప్రాముఖ్యతను లారీ డ్రైవర్లకు వివరించారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.లారీ డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, అలాగే మద్యం సేవించి వాహనాలు నడప వద్దని తెలిపారు.లారీలు మైనర్ల నడపడం నిషేధమని, మద్యం సేవించి వాహనం నడపడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాల పై వివరించారు.ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు.ట్రాఫిక్ నియమాలను పాటించాలని మీకోసం మీ కుటుంబం ఎదురుచూస్తూ ఉంటుందని గుర్తు చేశారు.మీకు ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని అందుకే జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరబత్తిని మహతి మరియు హాస్పటల్ సిబ్బంది,పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జిల్లా స్థాయి క్రీడాకారులు ఎంపిక జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రమేష్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 31,:మెదక్ జిల్లా కేంద్రంలోని అవుట్డోర్ స్టేడియంలో జిల్లాలోని వివిధ మండలాల నుండి 31 మంది విద్యార్థులు విద్యార్థినీ, విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రమేష్ గంగాల తెలిపారు, . తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ లో చేరుటగాను జిల్లాలోని మూడో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలను నిర్వహించడం జరిగింది. వారు వివిధ అంశాలలో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా మార్కులను కేటాయించడం, అనంతరం విద్యార్థులను వారి తల్లిదండ్రులను సమావేశపరచి జిల్లా స్థాయి ఎంపికల్లో అర్హత యువజన సాధించినటువంటి విద్యార్థులకు ఏప్రిల్ 27 నుండి రాష్ట్ర స్థాయి ఎంపికలు హకీంపేట క్రీడా ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ , షటిల్ రన్, 800 మీటర్ల పరుగు అంశాలలో టెస్టులు నీర్వహించడం జరిగిందని . జిల్లా స్థాయిలో ఎంపిక కాబడిన విద్యార్థులు హకీమ్ పేట స్పోర్ట్స్ స్కూల్ లో ఏప్రిల్ 27 నుండి జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికల్లో పాల్గొనవలసి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల ఎంపిక నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు, మాధవ రెడ్డి, మధుసూదన్, శ్యాం, దేవేందర్ రెడ్డి, రవి, ప్రదీప్ రెడ్డి, సత్యం, దాసరి మధు, శంకర్, శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవే ను సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంవైరా మండలం గ్రీన్ ఫీల్డ్ హైవే ను ఎన్ హెచ్ ఎ ఐ ప్రాజెక్టు మేనేజర్ దివ్య తో కలిసి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించారు. త్వరలో గ్రీన్ ఫీల్డ్ హైవేప్రారంభమవుతున్న నేపథ్యంలో సోమవరం గ్రామం నుంచి వైరా పట్టణం రింగ్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. వైరా రింగ్ రోడ్ సెంటర్ నందు రోడ్డు ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు.వాహనదారులు రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,వాహనదారులు సీట్ బెల్ట్ ,హెల్మెట్లు ధరించాలని,మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి డ్రైవ్ చేయవద్దని సూచించారు.కార్యక్రమంలో వైరా ఏసీపీ సారంగపాణి, సిఐ వెంకటప్రసాద్, ఎస్సైలు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడోవ విడత 'అరైవ్.. అలైవ్' ప్రచార కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. అందులో భాగంగా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్పంచులు, ఆటో యూనియన్, మార్కెట్ యూనియన్లు, విద్యార్థులు, స్థానిక ప్రజలతో శ్రీకర ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా రోజురోజుకి పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి, రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రముఖులు, మీడియా, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతలో తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది తమ ధ్యేయమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటు బెల్టులు పెట్టుకోకపోవడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడడం, మద్యం సేవించి నడపడం, సిగ్నల్ జంప్, స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటోల ఓవర్ లోడింగ్, ఎడమవైపు నుంచి ఓవర్ టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై ఈ ప్రచారంలో ప్రత్యేక దృష్టి పెట్టామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై జరిమానా విధించడం తిరిగి తప్పిదాలు జరగకుండా జాగ్రత్త తీసుకుంటారని ఉద్దేశ్యమేనని అన్నారు. అరైవ్ ఆలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాద రహిత జిల్లాగా నిర్మించేందుకు సమావేశానికి వచ్చిన అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టంగా స్పష్టం చేశారు.ప్రమాదాన్ని చూసిన వెంటనే సహాయం చేసే వారికి ప్రభుత్వం రహవీర్ గా గుర్తించి నగదుతో ప్రోత్సాహిస్తుందని, పోలీసులు గౌరవం అందిస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు.రోడ్డు ప్రమాదాల జరగకుండా వేగం నియంత్రణ సూచిక బోర్డులను పోలీస్ కమిషనర్ స్వయంగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఏసిపి తిరుపతిరెడ్డి ఎస్సై సంతోష్ పాల్గొన్నా

# హాట్‌స్పాట్లను సందర్శించిన కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా :కల్లూరు ఏసీపీ కార్యాలయం ఖమ్మం రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా వి.ఎం.బంజర పోలీస్ స్టేషన్ పరిధిలో తరచు జరిగే రోడ్డు ప్రమాద హాట్‌స్పాట్లను ఎన్‌హెచ్ఏఐ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సైట్ ఇంజనీర్లు,మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్,మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు సిఐ తో కలసి కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సందర్శించారు. రింగ్ సెంటర్‌లో వేసిన రంబుల్ స్ట్రిప్స్‌ను పరిశీలించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వైపు వెళ్లే వాహనాల వేగాన్ని నియత్రించడానికి సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని సూచించారు. రోడ్లు స్పష్టంగా కనిపించే విధంగా రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించారు.అనంతరం "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్" 3వ దశలో భాగంగా హెల్మెట్ వాడకం, రహదారి భద్రతా నిబంధనలను పాటించడంపై వి.ఎం.బంజర్ రింగ్ సెంటర్‌లో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఆటో యూనియన్ సభ్యులు, దుకాణదారులు, ఇతర భాగస్వాములతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరుకోవడానికి సురక్షితమైన వాహనం నడపడం చాలా ముఖ్యమని అన్నారు. కుటుంబాలు క్షేమంగా ఉండాలని లక్ష్యంతో చేపట్టిన'అరైవ్ అలైవ్' భావనపై దృష్టి పెట్టి ముఖ్యంగా బయటకు వెళ్తున్న తమ భర్తలను, కుమారులను సురక్షితంగా వాహనం నడిపి క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పాలని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా కల్లూరు డివిజన్ లో వివిధ పోలీస్ స్టేషన్ల ఇతర శాఖలతో కలిసి 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం, గుంతలను పూడ్చడం, చెత్తాచెదారాన్ని తొలగించడం వంటి దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

**- మెదక్ జిల్లా ఎస్ పి శ్రీనివాస్ రావు**
**- జిల్లా లో స్పెషల్ డ్రైవ్ చేపడతాం**
**- చేగుంట లో నేత్ర వైద్య శిబిరం ప్రారంభం**




మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 31:రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అన్నివైపుల నుంచి చర్యలు తీసుకుంటున్నామని మెదక్ ఎస్ పి శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం చేగుంట పోలీసుల ఆద్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లాఎస్ పి శ్రీనివాస్ రావు హాజరైమాట్లాడుతూ..నిర్లక్ష్యపూ డ్రైవింగ్ వల్లనే వేలమంది ప్రాణాలు రోడ్డు ప్రమాదాల్లో కోల్పోతున్నారన్నారు. ప్రతిరోజు,ప్రతి గంటకు వందల మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని వాపోయారు. కంటి చూపు లోపం కూడా రోడ్డు ప్రమాదాల్లో ఒకటిగా గుర్తించి ఆటోడ్రైవర్లకు నేత్ర వైద్యశీ కోసం కంటి పరీక్షలు చేపిస్తున్నామని పేర్కొన్నారు.ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలను నడిపితే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ప్రజల్ని క్షేమంగా గమ్యం చేర్చే బాధ్యతను వారెప్పుడూ విస్మరించకూడదని గుర్తు చేశారు. అటు ప్రయాణికుల, ఇటు తమ కుటుంబ సభ్యులు జీవితాలు ఆటో డ్రైవర్లపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలనన్నారు. వారం రోజుల్లోనూ ప్రతి వాహనదారుడు సంబంధిత వాహన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఆ తరువాత జిల్లా లో స్పెషల్ డ్రైవ్ చేపడతామని తెలిపారు. ఇక ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడికి లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ కలిగి ఉండటం వారి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి జాగ్రత్తలు కూడా ప్రత్యేకంగా తామే చెప్పాల్సిరావడం దురదృష్టకరమనీ వాపోయారు. పోలీసులుగా శాంతి భద్రతలతో పాటు ప్రజల వ్యక్తిగత జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల నివారణ కూడా తమ విధుల్లో భాగం చేసుకున్నామన్నారు. ఈ విషయంలో ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఐశ్వర్య ఐ కేర్ సెంటర్ బృందం చే కంటి పరీక్షలు నిర్వహించింది. తగిన వైద్యం చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ వెంకట్ రాజా గౌడ్ , చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి,లైన్స్ క్లబ్ ప్రతినిధులు శంబుని శ్రీనివాస్,ఆకుల సుకెందర్,నాగరాజు,పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతిలోకి భారీగా చేరికలు కండువా కప్పి ఆహ్వానించిన కల్వకుంట్ల కవిత




మనప్రజాప్రతినిధి//హైదరాబాద్ మార్చి 31:సామాజిక తెలంగాణ ధ్యేయంగా, రాష్ట్ర సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క సమక్షంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పలువురు కీలక నాయకులు ఆ సంస్థలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది నాయకులకు కవితక్క కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.ముఖ్య నేతల చేరికతెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ దండెం ఆనంద్ గారి పిలుపు మేరకు.. జిల్లా ఉపాధ్యక్షులు వరద సతీష్ కుమార్, కదిరే భాస్కర్ గౌడ్, పూసల వినయ్ ఆధ్వర్యంలోగంభీరావుపేట: కూర సురేష్, బొమ్మవరం రంగారావు, ఎర్ర నరసయ్య.ఎల్లారెడ్డిపేట: బాయికాడి ఆంజనేయులు.కోనరావుపేట: కులేరు వినయ్.ముస్తాబాద్ (ఆవునూరు, మోహినికుంట): అంకని ప్రభుదాస్, ఎడ్ల రమేష్.సిరిసిల్ల పట్టణం (బి.వై నగర్): గుంటుక సంపత్.వేములవాడ: తోట కనకయ్య.ఏప్రిల్ 25న కొత్త పార్టీ దిశగా అడుగులుఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు వరద సతీష్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సమస్యలపై కల్వకుంట్ల కవిత చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారని తెలిపారు."రాష్ట్రంలో 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పరిపాలనపై విరక్తి చెందిన ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌ను ఎన్నుకుంటే, కేవలం రెండేళ్లలోనే ఆ పార్టీ ప్రజాధరణ కోల్పోయింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు, యువత ప్రత్యామ్నాయ నాయకత్వం కోసం కవితక్క వైపు చూస్తున్నారు. ఏప్రిల్ 25న కొత్త పార్టీ ఆవిర్భవించనున్న నేపథ్యంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి వందలాది మంది యువతీ యువకులు, వివిధ పార్టీల నేతలు జాగృతిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు," అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా నాయకులు నూనె మల్లేష్ యాదవ్, ఒరుసు అశోక్, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొవ్వూరి సంగమేశ్వర్ నియామకం



సదాశివాపేట మార్చ్ 31 (మనప్రజాప్రతి నిధి ):తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులుగా కోవూరు సంగమేశ్వర్ ను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రావు నియమించడం జరిగింది.ఈ సందర్భంగా కొవ్వూరు సంగమేశ్వర మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రెండవసారి అవకాశం రావడం తాను అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. రాష్ట్రంలో బిజెపి మరింత బలోపేతంగా చేయడానికి కృషి చేస్తానని, తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర బిజెపి పార్టీ పెద్దలు ఎంపీ రఘునందన్ రావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మరియు పార్టీ కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



హుస్నాబాద్ మార్చి // మనప్రజాప్రతినిధి.31: హుస్నాబాద్, మార్కెట్ యార్డ్ యందు ఆరబోసిన మక్కలను అకాల వర్షంద్వారా తీవ్రంగా నానడం జరిగింది ముఖ్యంగా మార్కెట్ అధికారుల యొక్క నిర్లక్ష్యం ద్వారానె,రైతులకు శాపంగా మారింది పూర్తిగా ఎండిన తర్వాత కూడా అధికారులు సంచులు ఇవ్వకపోవడం ద్వారా హుస్నాబాద్ మార్కెట్ యార్డ్ యందు పూర్తిగా మక్కలు నానిపోయిన పరిస్థితి వెంటనే రాష్ట్ర మంత్రివర్యులు హుస్నాబాద్ శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ స్పందించి తడిచిన మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి కోరడం జరుగుతుంది ఇప్పటివరకు కూడా హుస్నాబాద్ రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం చాలా విచారకరమైన విషయం కాబట్టి రైతులను బాధలను గుర్తు పెట్టుకొని వెంటనే స్పందించి ఆర్డీవో మరియు తాసిల్దార్ మార్కెట్ యార్డ్ సందర్శించి వెంటనే తడిసిన మొక్కల కొనుగోలు చేయాలని రైతుల పక్షణా డిమాండ్ చేయడం జరుగుతుంది లేకుంటే మార్కెట్ యార్డ్ ముందే ఆందోళన చేపడుతామని కూడా హెచ్చరిస్తున్నాం



# చేర్యాల మున్సిపల్ పాలకవర్గానికి జేఏసీ ధన్యవాదాలు




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం,చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఏకగ్రీవంగా తీర్మానం చేసినందుకు చేర్యాల మున్సిపల్ పాలకవర్గానికి జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు.మంగళవారం జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పది ఏళ్లుగా చేర్యాల ప్రాంత ప్రజలు జేఏసీగా ఏర్పడి వివిధ సందర్భాల్లో వివిధ రూపాల్లో అనేక ఉద్యమాలు నిర్వహిస్తూనే ఎప్పటికప్పుడు నాటి, నేటి ప్రభుత్వాలకు ఆకాంక్షను తెలియజేస్తున్న సందర్భంలో చేర్యాల మున్సిపాలిటీ పాలకవర్గం రెవెన్యూ డివిజన్ యొక్క ఆవశ్యకత ఆకాంక్షను గుర్తించి ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు మున్సిపల్ పాలకవర్గానికి జేఏసీగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.అలాగే చేర్యాల,మద్దూరు, కొమురవేల్లి,ధూల్మిట్ట మండలాల పరిధిలో ఉన్న గ్రామపంచాయతీ పాలకవర్గాలు మున్సిపల్ బాటలో నడిచి ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి ఆయా పార్టీల నాయకత్వానికి అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జేఏసీ నాయకులు అందె అశోక్,అందె బీరయ్య, ఈరి భూమయ్య,నంగి కనకయ్య,గౌండ్ల శ్రీనివాస్,శెట్టె కర్ణాకర్, తదితరులు ఉన్నారు.